

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 199 పేజీలు - 08 వెల - 05/- గురువారం 16-07-2026

## తరగతి గదుల్లో నేభవిష్యత్ నిర్మాణం

● అక్షరమే అభివృద్ధికి తొలిమెట్టు ● విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం ● ఆగస్టు నుంచి తొమ్మిది వస్తువులను గ్యారంటీగా అందజేస్తాం : కొత్తకోటలో ● పాఠశాల భవనాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



మహబూబ్‌నగర్ 'తరగతి గదిలోనే నిజమైన తెలంగాణ నిర్మాణం జరుగుతుంది. అక్షరమే అభివృద్ధికి తొలిమెట్టు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందలేదు. అందుకే విద్యాశాఖను తన దగ్గర పెట్టుకున్నా. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్రాన్ని చదువులో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

మిగతాది 2లో

## అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం: సీఎం

● మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన ● రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి ● రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం ● గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు ● కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు




ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

**విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా**

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు.

మిగతా 2లో



## 'అభయ' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిత

● మహిళల భద్రత కోసం అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్న అనిత ● చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని సూచన ● బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిల్లలకు హితవు




సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో 'అభయ' కార్యక్రమాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా 'అభయ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 'మహిళల భద్రత - మా బాధ్యత' అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని

మిగతాది 2లో

## కేంద్రమంత్రి కుమారస్వామితో కేటీఆర్ భేటీ..

- ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కేంద్రమంత్రితో కేటీఆర్ భేటీ
- కేంద్ర, రాష్ట్రాలు చెరో రూ.250 కోట్లు ఇస్తే ప్లాంట్ ప్రారంభించవచ్చని ప్రతిపాదన
- ప్లాంట్ తెరిస్తే 6,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరణ
- కేటీఆర్ వినతిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కుమారస్వామి



తెలంగాణలోని ఆదిలాబాద్‌లో గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని తక్షణమే పునరుద్ధరించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

మిగతా 2లో

## రండి.. చట్టాన్ని ఎదుర్కోండి

● ఈ ఏడాది చివరి నాటికి బంగ్లాదేశ్ వెళతానంటున్న షేక్ హసీనా ● హసీనాను స్వాగతమన్న ప్రధాని రెహమాన్ సలహాదారు జాహెద్ ● అయితే తనపై ఉన్న కేసులను హసీనా ఎదుర్కోవాలని వ్యాఖ్య



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మళ్లీ స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలపై అక్కడి ప్రస్తుత ప్రభుత్వం అత్యంత దూకుడుగా స్పందించింది. ఆమె ఢాకాకు రావాలనుకోవడాన్ని తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని పేర్కొంటూనే.. దేశద్రోహం, మానవ హక్కుల ఉల్లంఘన కేసుల్లో మరణశిక్ష పడిన నేరస్థురాలిగా ఆమె చట్టాన్ని ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. 2024 ఆగస్టులో జరిగిన ప్రజా తిరుగుబాటుతో బంగ్లాదేశ్‌ను వదిలి పారిపోయిన షేక్ హసీనా... ప్రస్తుతం భారత్ లో తలదాచుకుంటున్నారు. అయితే, ఈ ఏడాది చివరినాటికి ఆమె స్వచ్ఛందంగా ఢాకాకు చేరుకుని, తన 'అవామీ లీగ్' పార్టీని మళ్లీ బతికించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

మిగతాది 2లో

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ

● మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్ ● పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్ తో చర్చించామని వెల్లడి ● మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టీకరణ



రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే

## జగన్ భీమవరం సభ.. హైటెన్షన్.. హైడ్రామా!

- తోపులాటతో సభా ప్రాంగణంలో హైడ్రామా.
- భీమవరం సభలో భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు.
- అభిమానుల రద్దీతో గందరగోళ పరిస్థితులు.




ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి భీమవరం పర్యటనలో గందగోళం చోటుచేసుకుంది. ఆక్వా రైతుల పరామర్శకు భీమవరం వచ్చిన జగన్ సభలో ప్రసంగిస్తుండగా కార్యకర్తలు హంగామా సృష్టించారు. సభలో జగన్ మాట్లాడిన తర్వాత వెనుదిరిగి వెళ్లిపోతున్న సమయంలో అభిమానులు ఒక్కసారిగా వేదికపైకి దూసుకొచ్చారు. ఒకానొక సమయంలో కార్యకర్తల తాకిడితో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి కిందపడబోయారు. అంతేకాకుండా ఆయన సభలో మాట్లాడుతున్నప్పుడు కూడా కొందరు సభలో వేసిన టెంట్స్ పోల్స్ ఎక్కి హడావుడి చేశారు. ఇక ప్రతి మ్యాచ్ అత్యంత కీలకం మాజీ సీఎం జగన్ రెడ్డి పర్యటనలో ఇటువంటి సంఘటనలు తరచుగా జరుగుతుంటాయి. అభిమానులు నియంత్రణ కోల్పోయి ప్రవర్తించడం వల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. భీమవరం సభలో అభిమానులు ఒక్కసారిగా దూసుకురావడంతో జగన్ కూడా ఇబ్బంది పడినట్లు కనిపించింది. జగన్ తో కరచాలనం చేసేందుకు సెల్ఫీలు తీసుకునేందుకు కార్యకర్తలు ఎగబడినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో మాజీ సీఎం ను

మిగతాది 2లో

## గతంలో మమ్మల్ని అడ్డుకున్నారు.. ఇప్పుడు జగన్‌కు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం

బ్రాహ్మణి స్టీల్స్, ఓబులాపురం దోపిడీతోనే సాక్షి మీడియా ఏర్పాటు అని ఆరోపణ



● ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో లోకేశ్ సమావేశం ● జగన్ రాయలసీమ బిడ్డ కాదు.. సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ అని వ్యాఖ్యలు ● వాళ్లు ఫ్యాక్షన్ తెస్తే.. మేం ఫ్యాక్టరీలు తెచ్చి ఉద్యోగాలిస్తున్నాం అని వెల్లడి ● ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ఉద్ఘాటన

"గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును ఇంటి నుంచి బయటకు రానీయకుండా గేట్లకు తాళాలు వేయించారు. కానీ ఈరోజు మేం జగన్ స్వేచ్ఛగా ఎక్కడికైనా వెళ్లేందుకు అనుమతిస్తున్నాం. ఇదే మాకూ, వారికీ ఉన్న తేడా" అని మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ అన్నారు. బుధవారం ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో

# తరగతి గదుల్లో నేభవిష్యత్ నిర్మాణం

రాష్ట్రాన్ని చదువులో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. 'ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరాలి. విద్యార్థులు మైదానాల్లోనూ పోటీ పడాలి. మీ భవిష్యత్‌కు నాదీ హామీ. క్రీడల్లో రాణించేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీనకు గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చాం. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏండ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతాం' అని రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు. తెలంగాణ కోసం రాజకీయ నాయకులెవ్వరూ బలిదానాలు చేసుకోలేదని సీఎం తెలిపారు. ఉస్మానియా విద్యార్థి లోకం, తెలంగాణ విద్యార్థులంతా రోడ్డుపైకి వచ్చి ఆందోళన బాట పట్టిన తర్వాతే బలిదానాలను చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి సమాజాన్ని ఉద్ధరించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రాష్ట్రంలో పదేండ్లు పాలించిన పాలకులు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు పాఠశాలలో మౌలిక వసతులు లేక పేదలు సైతం ప్రభుత్వ పాఠశాలలను వదిలి ప్రయివేటుకు పంపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో 28వేల ప్రభుత్వ పాఠశాలల్లో 18లక్షల మంది విద్యార్థులు ఉంటే 11వేల ప్రయివేటు పాఠశాలల్లో 33లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు.

అందుకే విద్యారంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి ఇంటిగ్రేటెడ్ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయడంతో పాటు దశాబ్ద కాలం పాటు ఎదురుచూసిన బదిలీలు, పదోన్నతులు కల్పించి ఉపాధ్యాయులకు సైతం న్యాయం చేశామన్నారు. గత పాలకుల మాదిరిగా కాకుండా బదిలీలు, పదోన్నతుల్లో ఎక్కడా విమర్శలు రాకుండా పారదర్శకంగా నిర్వహించామన్నారు. 33 జిల్లాలలో 18వ స్థానంలో ఉన్న పాలమూరును మొదటి స్థానంలో నిలబెడతామని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న జర్మన్, జపాన్, బ్రిటిష్ భాషలో రాణించి ఉన్నత స్థాయిలో ఎదగాలని కోరారు. ఈ ఆగస్టు నుంచి 25 లక్షలా 50వేల మంది విద్యార్థులకు తొమ్మిది వస్తువులను గ్యారంటీగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత చదువులతో పాటు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు జిల్లాకు ట్రిబుల్ ఐటీ ఇంజినీరింగ్‌తో పాటు ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేశామన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్ సరిత, నాయకులు సంపత్ కుమార్ పాల్గొన్నారు.

**అమరరాజా సెల్ మాన్యు ఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభం**

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో పర్యటించారు. అక్కడ అమరరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అమరరాజా సంస్థ మహబూబ్‌నగర్ జిల్లాలో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. చైనాతో పోటీపడే ఈ సంస్థకు సంపూర్ణంగా సహకారం అందిస్తామని తెలిపారు. కాలుష్యం లేని దేశంగా తీర్చిదిద్దేందుకు ఈవీలను ప్రోత్సహించాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి త్వరలో శుభవార్త వినిపిస్తామన్నారు.

# కేంద్రమంత్రి కుమారస్వామితో కేటీఆర్ భేటీ..

బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమైన ఆయన, ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కటీఆర్‌తో పాటు సీసీఐ సాధన సమితి ప్రతినిధులు, రైతులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జోగు రామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కేంద్రమంత్రిని కలిసింది. ఈ ప్లాంట్ పునరుద్ధరణ ద్వారా వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతం యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని కేటీఆర్ వివరించారు.దాదాపు 2,300 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్లాంట్‌కు ఏటా 4 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, సుమారు 100 ఏళ్లకు సరిపడా సున్నపురాయి నిల్వలు అక్కడ ఉన్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తి నిరుపయోగంగా మారి తుప్పు పట్టకుండా కాపాడాలని ఆయన కోరారు. సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడితో అక్కడ అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చని ప్రతిపాదించారు.కంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.250 కోట్ల చొప్పున 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' అందిస్తే, ప్లాంట్ కార్యకలాపాలను పునఃప్రారంభించవచ్చని కేటీఆర్ సూచించారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 6,000 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కేటీఆర్ విన్నపంపై కేంద్రమంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు అందించిన తరహాలోనే ఇక్కడి ప్లాంట్‌కు కూడా మద్దతు ఇవ్వాలని, లేనిపక్షంలో ఫ్యాక్టరీని తెరిపించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

**మీడియాతో మాట్లాడిన కేటీఆర్**

ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పోరాటం, ఆందోళన తెలంగాణ ప్రయోజనాల కోసమే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి ద్వేషం లేదని, అయితే ఆయన తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను మాత్రమే తాము ప్రశ్నిస్తున్నామని తెలిపారు. ప్రజల దృష్టిని మళ్లించడంలో రేవంత్ రెడ్డి అందెవేసిన చేయి అని, ఆ విద్యలో ఆయన ఇప్పటికే నాలుగైదు పీహెచ్‌డీలు చేశారని ఎద్దేవా చేశారు.రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 31 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ తమ పార్టీనే లక్ష్యంగా చేసుకోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పార్టీ అని వ్యాఖ్యానిస్తున్న ముఖ్యమంత్రి, మరి మళ్లీ తమ పార్టీనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, దీనిపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి 76 పర్యాయాలు ఢిల్లీకి వెళ్లినా, రాష్ట్రానికి కనీసం 76 పైసలైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ సహా పలు అంశాల్లో ఆధారాలు లేకుండా తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# గతంలో మమ్మల్ని అడ్డుకున్నారు.. ఇప్పుడు జగన్‌కు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం

అని మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ అన్నారు. బుధవారం ప్రొద్దుటూరు



నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "జగన్ రాయలసీమ బిడ్డ కాదు, ఈ సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ" అని లోకేశ్ ఘాటుగా విమర్శించారు. బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో 14,000 ఎకరాల భూమిని కారుచౌకగా కొట్టేసి, 10,000 ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ఆరోపించారు. ఓబులాపురం గనుల నుంచి దోచుకున్న సొమ్ముతోనే సాక్షి పత్రిక, టీవీలను ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. ఐదేళ్ల పాలనలో కడప జిల్లాకు జగన్ చేసిందేమీ లేదని, ఆయన నియోజకవర్గమైన పులివెందులకు నీళ్లిచ్చింది కూడా చంద్రబాబేనని గుర్తుచేశారు. "గొడ్డలి పార్టీ ఫ్యాక్షనిజం తెస్తే, మేం ఫ్యాక్టరీలు తెస్తున్నాం. రాయలసీమలో వారు రక్తాన్ని పారిస్తే, మేం ఉద్యోగాల పంట పండిస్తున్నాం" అని లోకేశ్ అన్నారు. తమ ప్రభుత్వం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమిపూజ చేసిందని, ఎస్ఏఈఎల్ ఎనర్జీ ప్లాంట్‌ను ప్రారంభించిందని తెలిపారు. ఎంతచేసినా కార్యకర్తల రుణం తీర్చుకోలేం వైసీపీ హయాంలో దారుణహత్యకు గురైన బీసీ నేత నందం సుబ్బయ్య కుటుంబాన్ని ఆదుకుని, పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూల్‌లో చదివిస్తున్నామని చెప్పారు.

ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలేనని లోకేశ్ అన్నారు. ఎంతచేసినా వారి రుణం తీర్చుకోలేమని భావోద్వేగంతో చెప్పారు. "ప్రొద్దుటూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నాపై కోడిగుడ్లతో దాడిచేసి, భయపెట్టాలని చూశారు, జి.ఓ. నెం.1 పేరుతో పాదయాత్రను అడ్డుకోవాలని విఫలయత్నం చేశారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోట కడప జిల్లా. మధ్యలో రెండు ఎన్నికల్లో ఇబ్బందిపడినా గత ఎన్నికల్లో పోరాడిన కార్యకర్తలు పార్టీకి గత వైభవం తెచ్చారు. అధికారంలోకి వచ్చామని కష్టకాలాన్ని మర్చిపోకూడదు. నేను పాదయాత్ర బుక్ చూసినపుడు ఆనాటి స్మృతులన్నీ గుర్తుకువస్తుంటాయి" అని వివరించారు. ఈ నెల 24న రెండో విడత 'తల్లికి వందనం' నిధులను జమ చేయనున్నట్లు ప్రకటించారు. రూ.4000 పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను అమలు చేస్తున్నామన్నారు. వైఎస్ఆర్‌సిపి హయాంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించామని, చెత్తపన్నును రద్దు చేశామని తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, నాయకులందరూ వర్గాలను పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత, పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ

మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతామన్నారు. మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో కూడా మాట్లాడానని మహేశ్ తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగా రేణుక తనతో చెప్పారని అన్నారు. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు అని తెలిపారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు.

# 'అభయ' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిత

'మహిళల భద్రత - మా బాధ్యత' అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో పోరాటాల వలన మహిళలకు స్వేచ్ఛ వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ధైర్యం కల్పించడానికి 'అభయ' కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారని తెలిపారు. చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని... కష్టపడి చదువుకొని, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఈ సందర్భంగా పిల్లలకు ఆమె సూచించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని అనిత సూచించారు. ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెడితే తక్షణమే 112కి కాల్ చేయాలని అన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి అంటూ పిల్లలకు హితవు పలికారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో కూడా అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

# జగన్ భీమవరం సభ.. హైటెన్షన్.. హైడ్రామా!

చెబుతున్నారు. ఈ క్రమంలో మాజీ సీఎం ను చుట్టుముట్టడంతో ఆయన ఎటూ కదలలేని పరిస్థితికి చేరుకున్నారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది అలర్ట్ అయ్యారు. మాజీ సీఎంపైకి దూసుకువస్తున్న అభిమానులను అడ్డుకుని వేదికపై నుంచి కిందకు విసిరేశారు. ఈ క్రమంలో తోపులాట, తొక్కిసలాట జరిగే ప్రమాదంపై ఆందోళన వ్యక్తమైంది. ఎప్పుడూ ఇంతేనా.. మాజీ సీఎం జగన్మోహనరెడ్డి సభలు, సమావేశాల్లో ఇటువంటి పరిస్థితి నెలకొనడంపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది. మాస్ లీడర్ గా ఎలివేషన్ కోసం వైసీపీ నేతలు స్వయంగా ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారని విపక్ష పార్టీల కార్యకర్తలు విమర్శిస్తున్నారు. అవసరం అయిదానికి కానిదానికి ఇలా ప్రవర్తించడంపైనే సోషల్ మీడియాలో కూడా ట్రోలింగ్ జరుగుతుంటుందని అంటున్నారు. జగన్ రెడ్డికి ఎక్కడికి వెళ్లినా జనం రద్దీ ఎక్కువగా ఉండేలా పార్టీ ఏర్పాట్లు చేస్తుంటుందని, దాంతో ప్రైవేటు కార్యక్రమాలు అయిన పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లలో సైతం వైసీపీ కార్యకర్తలు అనవసర హంగామా చేస్తుంటారని విమర్శలు చేస్తున్నారు. మాస్ జాతర అయితే విపక్షాల విమర్శలను వైసీపీ కొట్టిపడేస్తుంది. రాష్ట్రంలో ఏ ఇతర నేతకు లేనిస్థాయిలో జగన్ రెడ్డికి మాస్ ఇమేజ్ ఉందని ఆ పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అందుకే మాజీ సీఎం ఎక్కడికి వెళ్లినా అభిమానులు పోటెత్తుతారని అంటున్నారు. ఇక గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత వైసీపీ అధినేత ఎక్కడికి వెళ్లినా వేల మందితో కార్యక్రమాలు నిర్వహించడానికే వైసీపీ ప్రాధాన్యమిస్తోంది. గుంటూరు జిల్లా సత్తెనపల్లె టూరు మొదలుకొని తాజాగా భీమవరం టూర్ వరకు జగన్ ఎక్కడికి వెళ్లినా అభిమానులు క్రమశిక్షణా రాహిత్యం వల్ల ఏదో సమస్య వెలుగుచూస్తునే ఉంది. సత్తెనపల్లె పర్యటన సందర్భంగా జగన్ కాన్వాయ్ కింద ఓ కార్యకర్త పడి మరణించాడు. అదేవిధంగా అనంతపురం జిల్లా రాప్తాడు పర్యటనకు వెళ్లిన సమయంలో హెలికాప్టర్ పైకి కార్యకర్తలు దూసుకువెళ్లడంతో జగన్ తిరుగు ప్రయాణానికి హెలికాప్టర్ పనికిరాకుండా పోయిందని అంటున్నారు. తాజాగా భీమవరంలో సైతం ఇటువంటి హడావుడే కనిపించడంపై విస్తృత చర్చ జరుగుతోంది. అభిమానులను వేదికపై నుంచి కిందకు తోసివేసిన సమయంలో ఏమైనా తొక్కిసలాట జరిగితే పెద్ద ప్రమాదానికి దారితీసేదని వ్యాఖ్యానిస్తున్నారు.

# యానంలో ఘనంగా కామరాజ్ నాడార్ జయంతి వేడుకలు



యానాం, జూలై 15 (ఆంధ్రప్రదేశ్ సమాచారం, దినపత్రిక) :- విద్యాదాత, మాజీ ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్ జయంతి వేడుకలు యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామరాజ్ నాడార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి పాల్గొన్నారు. నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించడంలో కామరాజ్ నాడార్ కృషి అనిర్వచనీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం: సీఎం



గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు.

వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు.

తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

## పంటల బీమాను ప్రభుత్వమే భరించాలి,

అన్నదాతల పై భారం వేయడం సరికాదు. మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి,



మంత్రాలయం పల్లె వెలుగు జులై 15 ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో వర్షభావం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అన్నదాతలు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం రైతులు వెంటనే పంటల వారీగా నిర్ణయించిన పంటల బీమా నగదు చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించింది. అయితే ఇప్పటి కే రైతు లు పెట్టుబడులు పెట్టి పూర్తి గా ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి తరుణంలో బీమా నగదు చెల్లించాలని అన్నదాతల పై భారం వేయడం సరికాదని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం లో కరోనా కష్టాలు ఉన్నప్పటికీ రైతు లు సాగు చేసిన పంటలకు ప్రభుత్వమే బీమా చేయించే దని గుర్తు చేశారు. అన్నదాతలకు అండగా ఉంటామని చెప్పిన ప్రభుత్వం ఇలాంటి భారం మోపడం సరికాదని హెచ్చరించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి గత ప్రభుత్వం లో మాదిరిగా నే ఈ ప్రభుత్వం కూడా పంటల బీమా రైతు లతో కాకుండా ప్రభుత్వమే చెల్లించాలని కోరారు.

## ఓటు విషయంలో కూడా బయోమెట్రిక్ ఆధారిత ధ్రువీకరణ వ్యవస్థ అమలు చేయాలి.

ముస్లిం హక్కుల పోరాట సమితి ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు కరాటే మా భాష.



పల్లె వెలుగు నంద్యాల రూరల్ 5 కిలోల రేషన్ బియ్యం తీసుకోవాలన్నా ఫింగర్ ప్రింట్ తీసుకుంటున్నారు. పింఛన్ పొందాలన్నా ఫింగర్ ప్రింట్ ద్వారా ధృవీకరణ చేస్తున్నారు.

అయితే, ప్రజాస్వామ్యానికి అత్యంత విలువైన మన ఓటు విషయంలో కూడా బయోమెట్రిక్ (ఫింగర్ ప్రింట్) ఆధారిత ధృవీకరణ వ్యవస్థను అమలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం మరియు ప్రభుత్వాలు పరిశీలించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు కరాటి మహాభాష కోరారు. దీనివల్ల ఓటర్ల గుర్తింపు మరింత పారదర్శకంగా, నకిలీ ఓటింగ్‌కు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. "ఒక ఓటు ప్రభుత్వాన్ని నిలబెడుతుంది. కాబట్టి ఓటు హక్కు రక్షణకు మరింత బలమైన ధృవీకరణ వ్యవస్థ అవసరం ఉందని అన్నారు."

## నంద్యాల జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసిన సుస్మిత రామనాథన్ ఐపీఎస్



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. ఏలూరు జిల్లా జగ్గారెడ్డిగూడెం ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సుస్మిత రామనాథన్ ఐపీఎస్ సాధారణ బదిలీలలో భాగంగా నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీగా నియామకం కావడం జరిగింది. నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ని జిల్లా పోలీస్ కార్యాలయంలో పుష్పగుచ్ఛంతో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేయండి.

సిపిఐ మండల కార్యదర్శి శివయ్య విజ్ఞప్తి



కొలిమిగుండ్ల (పల్లెవెలుగు న్యూస్) ప్రతినిధి:– బనగానపల్లెలో పట్టణంలో ఉన్నటువంటి ఆర్టిసి బస్టాండ్ ఇన్ గేట్ అవుట్ గేట్ లో స్పీడ్ బ్రేకర్లు వేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా విజ్ఞప్తి చేస్తా ఉన్నాం . రద్దీ ఎక్కువ ఉండడంతో అక్కడే టీ స్పాట్లు హోటల్స్ అనేక దుకాణాలు ఉండడంతో బస్సులు బ యి ౦ ట క ౦ వచ్చేటప్పుడు,పోయేటప్పుడు ప్రయాణికులు ద్విచక్ర వాహన దారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది అలాగే ఏదైతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు బనగానపల్లెకు వస్తున్న సందర్భంగా కొన్ని స్పీడ్ బ్రేకర్స్ తొలగించడం జరిగింది తొలగించినందుకు బనగానపల్లె హై స్కూల్ దగ్గర కాలేజ్ దగ్గర స్కూలుకు వచ్చేటప్పుడు పోయేటప్పుడు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు స్కూల్ దగ్గర కాలేజ్ దగ్గర స్పీడ్ బ్రేకర్స్ వేయాలని అలాగే గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర ఏదైతే తొలగించిన స్పీడ్ బ్రేకర్స్ వెంటనే వేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తా ఉన్నాం ప్రమాదాలు జరిగిన తర్వాత బాధపడే దానికన్నా ముందుగానే మేల్కొని స్పీడ్ బ్రేకర్స్ వేయాలని ఎక్కడైతే స్పీడ్ బ్రేకర్స్ తొలగించిన చోటల్లా మళ్లీ స్పీడ్ బ్రేకర్లు వేయాలని విజ్ఞప్తి చేస్తావున్నాం

# నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.

**● జూలై 18,19వ తేదీలలో. ● వేదిక: ఎస్ బి ఐ కాలనీ లో ఉన్న రామకృష్ణ పిజి కళాశాల.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో ఈనెల 18, 19వ తేదీలలో నంద్యాల ఎస్బిఐ కాలనీలో ఉన్న రామకృష్ణ పిజి కళాశాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్రం లోని అన్ని జిల్లాల నుండి ఎంపికైన క్రీడాకారులు



పాల్గొంటున్నారు.నంద్యాలలో జరుగుతున్న సీనియర్ చెస్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటారు.

నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలలో,ఆసక్తి ఉన్న చెస్ క్రీడాకారులు పాల్గొనాలని ఆహ్వానించారు. ఏపీ చెస్ వెబ్సైట్ ద్వారా క్రీడాకారులు ఈనెల 17 వ తేదీ సాయంత్రం లోను ఎంట్రీలు నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 9010451585 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

## నంద్యాల పట్టణంలో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల







పట్టణంలోని పద్మావతి నగర్ స్మశాన వాటిక రోడ్లు, డ్రైనేజీ కల్వర్ట్, టెక్కే నుంచి స్టేట్ బ్యాంక్ కాలనీకి వెళ్లే రహదారి, సమత విద్యానికేతన్ పరిసరాల్లో నెలకొన్న డ్రైనేజీ మరియు రోడ్ల సమస్యలను నేడు నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ ఎన్.ఎం.డి. ఫయాజ్ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సమస్యలను స్థానిక ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు, సామాజిక మాధ్యమాలు మరియు మీడియా ద్వారా కూడా ప్రస్తావించగా, వాటిపై తక్షణ స్పందనగా అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను సమస్యలను ఓర్పుగా విన్న అధికారులు, అవసరమైన చర్యలు తీసుకుని రోడ్లు, డ్రైనేజీ మరియు కల్వర్ట్ పనులను వీలైనంత త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మానియార్ ఖలీల్ , వార్డు ఇన్‌చార్జ్ మధు సాయి , పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ప్యాపిలి మండల బీజేపీ అధ్యక్షుడిగా మూడోసారి కే.బీ. దామోదర్ నాయుడు ఏకగ్రీవం



పల్లె వెలుగు –?ప్యాపిలి మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ నాయకుడు కే.బీ. దామోదర్ నాయుడు భారతీయ జనతా పార్టీ ప్యాపిలి మండల అధ్యక్షుడిగా వరుసగా మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నంద్యాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమగ్ర సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.

?నంద్యాల బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో దామోదర్ నాయుడు అందించిన సేవలు, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తించి, కార్యకర్తలు అధిష్టానం ఆయనను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

?పార్టీ బలోపేతమే నా లక్ష్యం: దామోదర్ నాయుడు

?ఈ సందర్భంగా కే.బీ. దామోదర్ నాయుడు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో మూడోసారి మండల అధ్యక్ష పదవిని అప్పగించిన జిల్లా నాయకత్వానికి, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "మండలంలోని ప్రతి గ్రామంలోనూ నిత్యం పర్యటిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. అధికార, ప్రతిపక్ష పార్టీలకు దీటుగా ప్యాపిలి మండలంలో బీజేపీని ఒక ఉన్నత స్థాయికి తీసుకెళ్తాం. నన్ను నమ్మి అప్పగించిన బాధ్యతను వమ్ము చేయకుండా, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాను.

?అంతేకాకుండా,రాబోయే 2029 నాటికి మండలంలోని ప్రతి గ్రామంలోనూ భారతీయ జనతా పార్టీ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా, పార్టీ బలోపేతం కోసం కీలక పాత్ర పోషిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# జూలై 30,31 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనలకు సిద్ధం కండి.సి ఐ టి యు.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాష్ట్రవ్యాప్తంగా



షెడ్యూల్డ్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులందరికీ కనీస వేతనాలను అమలు చేయాలని కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ జులై 30, 31 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వి ఏసురత్నం, ఏ నాగరాజు జిల్లా కార్యదర్శిలు లక్ష్మణ్, బాల వెంకట్ నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కే మహమ్మద్ గౌస్,పి వెంకట లింగంలు పాల్గొన్నారు.

అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి యేసురత్నం ఏ నాగరాజు లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ యజమానుల వద్ద షాపులు, సంస్థల్లో 50 లక్షల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం వారికి 5 సంవత్సరాలకోసారి వేతనాలు సవరించాలి. వాటిని యజమానులచే అమలు చేయించాలి. కానీ, 2007 తర్వాత 2012, 2017, 2022 సంవత్సరాల్లో మూడు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వం వీరికి వేతనాలు పెంచలేదు. ఫలితంగా ఇప్పటికీ 2026 ఏప్రిల్ 1 నుండి వచ్చే వీడీఏ ను కలుపుకున్నా కూడా కనీస స్థాయిలో నెలకు రూ. 12 వేల నుండి రూ.13 వేల మధ్యలోనే వేతనాలు ఉన్నాయని,రాష్ట్ర ప్రభుత్వం కాలానుగుణంగా వేతనాలు పెంచి ఉంటే కనీస స్థాయిలో ఈ పాటికి రూ. 19 నుండి రూ. 21 వేల వరకు వచ్చి ఉండేవి. మన ప్రక్కనే ఉన్న కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం అక్కడి కార్మికులకు ఇటీవల 60 శాతం వేతనాలు పెంచింది. ప్రాంతాన్ని బట్టి కనీస స్థాయిలో నెలకు రూ.21,251 నుండి రూ.25,714 లు ప్రకటించిందని,కనీస వేతనాలకు సంబంధించి 1957లో జరిగిన భారత కార్మిక మహాసభ సూచించిన ప్రామాణికాలను, 1992లో సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ధరలలో నెలకు కనీస స్థాయిలో రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని,నిత్యం ధరలు పెరుగుతున్నందున కార్మికుల నిజవేతనాలు పడిపోతున్నాయి. కార్మిక కుటుంబ భారాలు కాలక్రమేణా పెరుగుతున్నాయి. 5 సంవత్సరాలకోసారి కనీస వేతనాలు పెంచడం తప్పనిసరి. కావున మా విజ్ఞప్తిని పరిశీలించి నెలకు రూ. 26 వేలు నిర్ణయించి యజమానులతో అమలు చేయించాలని,71 షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని,కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని,పని ప్రదేశాల్లో భద్రత చర్యలు చేపట్టాలని,లేబర్ కోడ్స్ రద్దు చేయాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలని,అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వెలుగు, సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ ఉపాధి హామీ, 108, 104, తల్లీ బిడ్డ. ఆరోగ్యమిత్ర, అర్బనెల్త్, ఆయూష్ తదితర అన్ని ప్రభుత్వ పథకాల ఉద్యోగులుగా గుర్తించాలి. వేతనాలు పెంచాలి. ఐ టి ఔట్సోర్సింగ్, అప్కాస్, ప్రభుత్వ రంగ, స్థానిక సంస్థల, పథకాల కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని,అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వెలుగు, సమగ్ర్యశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ తదితర ప్రభుత్వ పథకాల ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ జూలై 30 31 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి హెచ్చరిక పంపాలని కార్మిక వర్గాల సత్తా ఏందో చూపించేందుకు సిద్ధం కావాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

# ఇద్దరు దోపిడీ దొంగల అరెస్టు,

చోరీ సొత్తు స్వాధీనం.



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. ఈ నెల 13వ తేదీన నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన షఫీ అనే వ్యక్తి హైదరా బాద్ నుంచి కర్నూలుకు వచ్చి, ఆత్మకూరుకు వెళ్లేందుకు బళ్లారి చౌరస్తా వద్ద అర్ధరాత్రి సమయం లో వాహనం కోసం వేచి ఉన్నాడు. ఈ సమయంలో మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు అతని వద్దకు వచ్చి గొడవకు దిగడంతో పాటు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అతనిపై దాడి చేసి గాయపరిచి, అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఛార్జర్, మనీ పర్స్‌లో ఉన్న నగదు అపహరించి పరారయ్యా రు. బాధితుడి ఫిర్యాదు మేరకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు దోపిడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. దర్యాప్తులో భాగంగా సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను బాలా జీ నగర్‌కు చెందిన మణికుమార్, అరుణ్ కుమార్ లుగా గుర్తించారు. ఎస్ఐ చంద్ర శేఖర్ సిబ్బంది సుబ్బరాయుడు, మురళి కలిసి గాలింపు చేపట్టి నిన్న రాత్రి చెన్న మ్మ సర్కిల్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు తరలించా రు. ప్రాథమిక విచారణలో నిందితులపై గతంలో కూడా పలు కేసులు నమోదైనట్లు గుర్తించారు. మణికుమార్ పై రెండు,అరుణ్ కుమార్‌పై ఐదు కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్ల డించారు. వీటిలో ఇంటి కన్నం దొంగతనాలు, మోటార్‌సైకిల్ దొంగతనం కేసులు ఉన్నాయి.ప్రజలకు విజ్ఞప్తి: ఎక్కడైనా నేరం అనుమానాస్పద వ్యక్తులు లేదా అత్యవసర పరిస్థితులు కనిపిం చిన వెంటనే డయల్ 112కు సమాచారం అందించి పోలీసు లకు సహకరించాలని కర్నూలు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# అసాంఘిక కార్యకలాపాలపై కర్నూలు నాల్గవ పట్టణ పోలీ సుల వరుస దాడులు.

నలుగురు నిర్వాహకులు అరెస్ట్.



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టైలర్స్ కాలనీ లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు కర్నూ లు నాల్గవ పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కర్నూలు జిల్లా సి. బెళగల్ మండ లానికిచెందిన మల్లెపోగు ఏసన్న, మల్లెపోగు రాజు, అశోక్‌నగర్‌కు చెందిన అన్నెపోగు రాఘ వేంద్ర, ముదుమాలగుత్తికి చెందిన పోల దాసు మాసమన్నలను నిర్వాహకులు గా గుర్తించి అరెస్టు చేశారు.ఈ ఘటనపై ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్ట్ (గ్రాxూూ) కింద కేసు నమోదు చేసి, నింది తులను న్యాయస్థానం ఎదుట హాజరు పరచగా గౌరవ న్యాయ మూర్తి రిమాం డ్‌కు ఆదేశించి నట్లు తదుపరి దర్యాప్తు కొనసా గుతోందని కర్నూలు నాల్గవ పట్ట ణ సీఐ శ్రీ విక్రమ్ సింహ తెలిపారు. ప్రజ లకు విజ్ఞప్తి, తమపరి సరాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నేరాలు లేదా ప్రజలకు ఇబ్బందులు కలిగించే సంఘట నలు జరిగినా అనుమా నాస్పద వ్యక్తు లు కనిపించినా లేదా ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినా వెంటనే డయల్ 112 కు సమాచారం అందించి పోలీ సులకు సహకరించాలని కర్నూ లు పోలీసులు ప్రజలను విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసీ బస్టాండ్‌లో దాడి ఘటన

ముగ్గురు నిందితులు అరెస్టు.



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. గోరంట్ల గ్రామానికి చెందిన నాగ రాజు అనే వ్యక్తి కర్నూలు ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్ కాం ప్లెక్స్‌లో టీ స్టాల్ నిర్వహి స్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి సమయంలో కర్నూలు ఇందిరానగర్‌కుచెందిన ఉదయ్ కుమార్, వినోద్, నవీన్ టీ స్టాల్ వద్దకు వచ్చి టీ, సిగరె ట్లు ఇవ్వాలని కోరారు. సిగరెట్ల ధర విషయంలో టీ స్టాల్ యజ మాని నాగరాజు, నిందితుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీ సింది. ఈ క్రమంలో నిందితులు మరు గుతున్న వేడిటీ ఉన్న పాత్రను నాగరా జుపైకి విసరడంతో అతనిఛాతి భాగంలో బొబ్బలతో కూడిన కాలినగా యాల య్యాయి. వెంటనే బాధి తుడిని ఆసుప త్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమో దుచేశారు.కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులైన ఉదయ్ కుమార్, వినోద్, నవీన్ లను అరెస్టు చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా గౌరవ న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదే శించినట్లు తెలిపారు.

# ఆశల ఊబిలో అన్నదాతలు

**950 హెక్టార్లలో వరి సాగు**

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 15: ఎల్నినో



ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు వరి సాగుకు పూనుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి కాబట్టి, రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని ఓవైపు వ్యవసాయ శాఖ యంత్రాంగం సూచనలు చేస్తున్నప్పటికీ రైతులు మాత్రం వీటిని ఆచరించే పరిస్థితిలో లేరు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్లో వరి సాగు చేస్తున్నాము కాబట్టి, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ వర్షం కురుస్తుందని ఆశతో వరి సాగుకు పూనుకుంటున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఆశల ఊబిలో కూరుకొని పోయి, నానా తంటాలు పడుతున్నారు . వర్షాలు కురియక బోర్లలో భూగర్భ జలాలు అటుగంటి పోయినప్పటికీ, రైతులు లెక్కచేయడం లేదు. బండి ఆత్మకూరు మండలం పరిధిలోని ఈర్నపాడు కడమల కాలువ వెంగళ్రెడ్డిపేట ఏ కోడూరు బి కోడూరు ప్రాంతాలలో 1900 ఎకరాలలో వరి సాగుకు పూనుకున్నారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే గ్రామాలలో కొన్నిచోట్ల డ్రై షోయింగ్ పద్ధతిలో వరిని సాగు చేసుకుంటున్నారు. ఈర్నపాడు గ్రామానికి చెందిన సిద్ధం మౌలాలి రెడ్డి అనే రైతును వరి సాగు విషయంపై ప్రశ్నిస్తే, తన అనుభవాలను గురించి వివరించారు. బుధవారం తనకున్న ఆరు ఎకరాల పొలంలో మూడు ఎకరాల పొలంలో వరినాట్లను వేయడం జరిగిందని పేర్కొన్నారు. 26 రోజుల క్రితమే విత్తనం వడ్లను చల్లడం జరిగిందని తెలిపారు. ఒక్కొక్క ఎకరాకు పొలాన్ని చదును చేసుకునేందుకు 6000 దాకా ఖర్చు అవుతుందని, నాటు కూలీలకు గాను 3500 ఖర్చు అయిందని తెలిపారు. విద్యుత్ సరఫరా కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవని ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రైతులకు సరఫరా అవుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకున్నప్పటికీ, బో ర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోవడం ఆందోళన కలిగిస్తూ ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులలో వరి సాగును చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి కదా! అని రైతును ప్రశ్నిస్తే, వర్షం కురుస్తాదన్న ఆశతోనే వరిని సాగు చేసుకుంటున్నానని తెలిపారు. ఎల్నినో ప్రభావం కారణంగా ఆరుతడి పంటలను వేసుకోవాలన్న ఆశ ఉన్నప్పటికీ, భవిష్యత్తులో వర్షం కురిసి, కాలువలు నిండితే, ఆరుతడి పంటలు సాగు వల్ల నష్టపోవాల్సి వస్తుందని సిద్ధం మౌలాలి రెడ్డి వివరించారు.

# శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల ఐఈఎల్ట్స్ మెగా ఛాలెంజ్

నంద్యాల ప్రతినిధి. జూలై 15 . (పల్లె వెలుగు):




నంద్యాలలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్), తమ వెర్బల్ వాయేజర్స్ -- ఇంగ్లీష్ క్లబ్ ద్వారా, జూలై 15, 2026న ఈఎల్సిఎస్ ప్రయోగశాలలో ఐఈఎల్ట్స్ మెగా ఛాలెంజ్ -- ఎల్ఎస్ఆర్డబ్ల్యూ నైపుణ్యాల మదింపును విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఐఈఎల్ట్స్ పరీక్షపై అవగాహన కల్పించడం మరియు విద్యార్థుల ఆంగ్ల భాషా ప్రావీణ్యాన్ని, ముఖ్యంగా లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, మరియు రైటింగ్ (ఎల్ఎస్ఆర్డబ్ల్యూ) నైపుణ్యాలను మెరుగుపరచడం. ఈ మదింపును ఐఈఎల్ట్స్ పరీక్షా సరళిని అనుసరించి నిర్వహించారు. దీని ద్వారా విద్యార్థులు పరీక్షా విధానంపై ఆచరణాత్మక అవగాహన పొంది, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, మరియు ప్రపంచవ్యాప్త ఉద్యోగ అవకాశాల కోసం తమను తాము సిద్ధం చేసుకోగలిగారు.ఈ ఛాలెంజ్‌లో వివిధ విభాగాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి. సుబ్రమణ్యం ఇంగ్లీష్ క్లబ్‌ను అభినందించి, విద్యార్థుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. నేటి పోటీ ప్రపంచంలో అంతర్జాతీయ భాషా ప్రావీణ్య పరీక్షలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రపంచవ్యాప్త విద్యా మరియు వృత్తి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తాయని ఆయన నొక్కి చెప్పారు. అసెస్‌మెంట్‌కు ముందు, ఇంగ్లీష్ క్లబ్ కోఆర్డినేటర్ ఎం. రాజా, పాల్గొన్నవారికి ఇల్ట్స్ పరీక్ష యొక్క నిర్మాణం, సరళి మరియు ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ పరీక్ష రాయడం ద్వారా తాము గొప్ప అనుభవాన్ని పొందామని విద్యార్థులు తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రశ్నలు చాలా సవాలుగా ఉన్నాయని, ఈ అనుభవం పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి తమకు సహాయపడుతుందని వారు చెప్పారు. ఇది నియామకాల ఇంటర్వ్యూ సరళిపై అనుభవాన్ని పొందడానికి కూడా వారికి సహాయపడుతుంది.మొత్తంమీద, వెర్బల్ వాయేజర్స్ విద్యా ప్రపంచానికి మరియు కార్పొరేట్ ప్రపంచానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే దిశగా ఒక గొప్ప చొరవ తీసుకున్నారు.

# ప్రజా ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి , వైసీపీ నేతలు తీవ్ర సంతాపం.

**● వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయం.**

**● మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి .**

**● నంద్యాల వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మరణం పట్ల మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శిల్పా మోహన్ రెడ్డి తీవ్ర విచారాన్ని, సంతాపం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాదులోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముద్రగడ మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన మరణవార్త తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో, ముఖ్యంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో, బుధవారం నంద్యాల స్థానిక వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో మాజీమంత్రి శిల్పా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ప్రజా జీవితంలో ముద్రగడ చేసిన కృషి అనిర్వచనీయమని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు.

మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ..."ముద్రగడ పద్మనాభం గారి మరణం రాష్ట్ర రాజకీయాలకే కాకుండా, ప్రత్యేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక బలమైన ప్రజా నేతగా ఆయన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన అలుపెరగని పోరాటాలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, రెండుసార్లు మంత్రిగా ఉంటూ ప్రజలకు ఎనలేని సేవలు అందించిన గొప్ప చరిత్ర కలిగిన నేత అన్నారు. కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్ర ప్రజలందరి ఆదరాభిమానాలను పొందిన నాయకుడు ముద్రగడ. ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి... ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోశారని తెలిపారు. కాపు రిజర్వేషన్లు, రైతాంగ సమస్యలపై ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని. వైఎస్ఆర్ పార్టీ బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

ఈ సంతాప కార్యక్రమంలో నంద్యాల ప్రాంతానికి చెందిన వైఎస్ఆర్ సీపీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ముద్రగడకు జోహార్లు అర్పించారు.

ఈ కార్యక్రమంలో స్టేట్ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులు, స్టేట్ లీగల్ సెల్ అధికార ప్రతినిధి తిమ్మారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, వైసిపి నాయకులు కైలాసనాద్, కరెంటు శేఖర్,అడ్వకేట్ శీను, పార్థుడు, కామిని వెంకటేశ్వర్లు, దండే సుధాకర్,చుమ్మా రవి, రెండో వార్డు శ్రీను,దండే శ్రీనివాసులు, నంద్యాల అసెంబ్లీ గ్రీవెన్సెల్ అధ్యక్షులు వివేకానంద రెడ్డి, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, వైసీపీ నాయకులు జిఎం గౌస్, సాయిరాం రెడ్డి, ఎర్రన్న,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి పత్రికలే ప్రాణవాయువు.

● నిష్పాక్షిక జర్నలిజమే సమాజానికి దిక్సూచి, ● వార్త' వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన, ● వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బుట్టా రేణుక,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 15 ఎమ్మిగనూరులోని బుట్టా రేణుక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన "వార్త" దినపత్రిక వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రత్యేక సంచికను మాజీ ఎంపీ, కర్నూలు పార్లమెంట్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బుట్టా రేణుక బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి పత్రికలు నాలుగో స్తంభం మాత్రమే కాకుండా ప్రజల ఆశయాలకు ప్రతిబింబం, సమాజానికి దిక్సూచి అని అన్నారు. వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల తరఫున ప్రశ్నించే ధైర్యమే నిజమైన పాత్రికేయ ధర్మమని పేర్కొన్నారు. సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా చైతన్యం పెంపొందించడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని అన్నారు. వాస్తవాలను వక్రీకరించకుండా, నిష్పాక్షికంగా ప్రజల ముందుంచే జర్నలిజమే ప్రజాస్వామ్యానికి బలమని పేర్కొంటూ, "వార్త" దినపత్రిక యాజమాన్యం, సంపాదక వర్గం, పాత్రికేయులు, సిబ్బందికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్త క్రైం రిపోర్టర్ నాగరాజు,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేఆర్ రామకోటేశ్వర్ రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరూపాక్షి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డి.నజీర్ అహ్మద్, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు ఎంకే శివప్రసాద్, ఎమ్మిగనూరు మండల యువజన విభాగ అధ్యక్షులు బనవాసి బసిరెడ్డి, నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షులు మీసాల బండ నీలకంఠ, ఎమ్మిగనూరు పట్టణ రైతు విభాగ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ఎమ్మిగనూరు మండలం కార్యదర్శి బోయ బజారి, నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం జరిగితే వారి పక్షాన పోరాడుతా: మాజీ ఎంపీ బుట్టా రేణుక

ఎమ్మిగనూరు, జూలై పల్లె వెలుగు 15: రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను నిర్వీర్యం చేసి రైతులను క్యూల్లో నిలబెట్టే పరిస్థితి తీసుకొచ్చారని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కర్నూలు






పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. వైఎస్ జగన్ హయాంలో రైతులకు గ్రామ స్థాయిలోనే అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం పంట నమోదు, బీమా తదితర అంశాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, రైతు భరోసా కేంద్రాల సేవలను పునరుద్ధరించి, రైతు బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా వారి పక్షాన నిలబడి పోరాడుతానని, బుట్టా ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని బుట్టా రేణుక స్పష్టం చేశారు.

# దామగట్ల లో "ఆత్మా" ఆధ్వర్యంలో సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం.




నందికొట్కూరు పల్లె వెలుగు జులై 15మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో బుధవారం ఆత్మా సౌజన్యంతో రైతులకు ఆర్‌పీఎల్ ఆధారిత పూర్వాభ్యాస గుర్తింపు శిక్షణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి షేక్షావలి ఆధ్వర్యంలో నిర్వహించారు.శిక్షణ కార్యక్రమమునకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలాజీ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన ఖరీఫ్ పంట కాలంలో ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల సమర్థ వినియోగం గురించి అవగాహన కల్పించారు.అలాగే ఆర్ డబ్ల్యు బి సి ఐ ఎస్ మరియు పంట బీమా పథకాల ప్రాధాన్యం, పంటల ప్రస్తుత స్థితిగతులు, క్రాపింగ్ ప్యాటర్న్, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం, హెచ్ డి పి ఎస్ పద్ధతిలో పత్తి సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు.రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

# పెసరవాయి గ్రామంలో ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన..

జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వారి సహకారంతో.






గడివేముల పల్లెవెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసర వాయి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం కర్నూల్ అమీలియా హాస్పిటల్ వైద్య బృందం చేత మరియు జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరము ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకురాలు ఒడ్డు లక్ష్మీదేవి ముఖ్యఅతిథిగా హాజరైనారు, ఈ శిబిరానికి కర్నూలు నుంచి అమీలియో హాస్పిటల్ వైద్య సిబ్బంది మరియు వైద్య బృందం మరియు వైద్యవిద్యార్థులు పాల్గొని గ్రామంలో సుమారు 158 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి టాబ్లెట్లు , మందులు, మరియు సిరప్ మొదలగునవి పంపిణీ చేశారు, ఈ ఉచిత వైద్యం శిబిరం నందు ఉచిత జనరల్ చెకప్ మరియు గుండె , జ్వరము బిపి క్యాన్సర్ గర్భిణీ స్త్రీలకు పలు రకాలు వైద్య సేవలు గ్రామ ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా అమీలియో హాస్పిటల్ డాక్టర్స్ మాట్లాడుతూ కర్నూల్ లో చాలా సంవత్సరాల పైగా అమిలియో హాస్పిటల్ నిరుపేదలకు తమ సేవలను అందిస్తుందని, ఆరోగ్యశ్రీ, ఈ హెచ్ ఎస్, ఏపీఎస్పీడీసీఎల్, చాలా ఇన్సూరెన్స్ కంపెనీలతో భాగస్వామ్యంగా ఉంటూ ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీ తో పాటు క్యాష్ లెస్ సేవలు అందిస్తున్నామన్నారు, ఆర్థో, కార్డియాలజీ, ఆప్తమాలజీ ,జనరల్ సర్జరీ ,గైనకాలజీ ,జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్, యూరాలజీ, నెఫ్రాలజీ, డయాలసిస్ మరియు ఎమర్జెన్సీ మెడికల్ విభాగాలలో ప్రత్యేక వైద్య బృందంతో మా కర్నూల్ అమీలియా హాస్పిటల్ నందు సేవలందిస్తున్నామని అన్నారు, ఈ కార్యక్రమంలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ సిఎస్ఆర్ టీం విజయలక్ష్మి పాల్గొన్నారు.గ్రామంలోని రోగులకు సేవలు అందించినందుకు గ్రామ ప్రజలు అమీలియా హాస్పిటల్ బృందానికి మరియు , జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఓటు హక్కు.. ప్రజాస్వామ్యానికి మూల స్తంభం

మహానంది,పల్లె వెలుగు ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి మూల స్తంభం అని





తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, మండల కన్వీనర్ శివ శంకర చౌదరి, మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మహానందిలోని తెదేపా కార్యాలయం యందు బూత్ కన్వీనర్లు, బి ఎల్ ఏ లు, యూనిట్ ఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలతో సర్ పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. అర్హులైన వారి ఓటు రక్షణ ప్రధాన లక్ష్యంగా పని చేయాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ సర్ గడువును ఈ నెల 24 వరకు పొడిగించిందన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియలో ఏలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు భాష్యం రాముడు గౌడ్, హరి ప్రసాద్ రెడ్డి, ఉల్లి మధు, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 13లోగా మైనారిటీ హాస్టళ్ల నిర్మాణం పూర్తి చేయాలి.

- నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం.
- మైనారిటీ సంక్షేమ హాస్టల్ భవనాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్.
- నాణ్యతతో పనులు పూర్తి చేసి భవనాలు హ్యాండోవర్ చేయాలి.
- పి ఎం జె వి కె కింద నిర్మిస్తున్న హాస్టళ్ల పురోగతిని సమీక్షించిన కలెక్టర్ రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హాస్టళ్ల పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ నగర్ (మూలసాగరం గ్రామం) ప్రధాన రహదారి సమీపంలో నిర్మాణంలో ఉన్న మైనారిటీ వెల్ఫేర్ హాస్టల్ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను అడిగి పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.





2022లో హాస్టళ్ల నిర్మాణం కోసం 4.5 ఎకరాల భూమిని కేటాయించగా, కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం ( పి ఎం జె వి కె) కింద వర్కింగ్ ఉమెన్ హాస్టల్, పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్, ప్రీ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్, ప్రీ మెట్రిక్ బాయ్స్ హాస్టల్‌లతో కూడిన మొత్తం నాలుగు భవనాలు నిర్మిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్ కలెక్టర్‌కు వివరించారు. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.2.10 కోట్ల వ్యయంతో, కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని, నీటి సరఫరా, వాష్‌రూమ్‌లు తదితర ప్రధాన పనులు పూర్తి కాగా, విద్యుత్ పనులు, పెయింటింగ్ వంటి మిగిలిన పనులు మాత్రమే కొనసాగుతున్నాయని కలెక్టర్ కు వివరించారు. మిగిలిన పనులను నెల రోజుల్లో పూర్తి చేసి భవనాలను అప్పగిస్తామని ఏపీడబ్ల్యూఏడీసీ ఇంజినీర్లు కలెక్టర్‌కు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా అన్ని పనులను అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన విద్యుత్, పెయింటింగ్, ప్రాంగణ అభివృద్ధి తదితర పనులను వేగవంతం చేసి వచ్చే నెల ఆగస్టు 13వ తేదీలోగా భవనాలను సంబంధిత శాఖకు హ్యాండోవర్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రతి అంశాన్ని పరిశీలించి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం హాస్టల్ సముదాయం సమీపంలో కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకునే అంశంపై సంబంధిత అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా రెవిన్యూ అధికారి రాము నాయక్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి లీలావతి ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఉన్నారు.

# లబ్ధిదారుల వివరాల అప్‌డేట్‌ను 100 శాతం పూర్తి చేయాలి.



- పోస్ట్ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు వెంటనే బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలి.
- ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను ముమ్మరం చేసి అర్హులందరికీ నమోదు పూర్తి చేయాలి.
- అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఫోటోలు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి.
- పాఠశాలల్లో పరిశుభ్రత, బోధన నాణ్యత, మధ్యాహ్న భోజనంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

జిల్లాలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తున్న తల్లికి వందనం, ఓడిఎఫ్‌ం, ఆధార్ ప్రత్యేక డ్రైవ్, పాఠశాలలు - హాస్టళ్ల తనిఖీలు, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, వాట్సాప్ మిత్ర సేవలు తదితర కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ నుండి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంఈఓలు, జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లికి వందనం పథకానికి సంబంధించి జిల్లాలో మొత్తం 2,079 మంది లబ్ధిదారుల వివరాలను పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,383 మంది వివరాలు మాత్రమే నమోదు చేసారన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, స్వర్ణగ్రామ్ - స్వర్ణవార్డ్ బృందాలు సమన్వయంతో పనిచేసి మిగిలిన వివరాలను గురువారం సాయంత్రంలోపు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పోర్టల్‌లో అందుబాటులో ఉన్న వివిధ ఆప్షన్లను సక్రమంగా వినియోగించి తల్లి-బిడ్డ ఆధార్, హౌస్‌హోల్డ్



మ్యాపింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పదో తరగతి వరకు చదివే విద్యార్థుల ప్రోత్సాహక నగదు తల్లుల ఖాతాల్లో, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలోని 1,749 మంది విద్యార్థులకు ఇంకా బ్యాంకు ఖాతాలు ప్రారంభం కాకపోవడం గమనార్హమని, పోస్టాఫీసుల ద్వారా వీలైనంత త్వరగా ఖాతాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పెండింగ్ కేసులు అధికంగా ఉన్న మండలాలు, పట్టణ ప్రాంతాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గడువులోగా సమస్యలను పరిష్కరించాలని, ఇప్పటికే జీరో పెండింగ్ సాధించిన ప్రాంతాల తరహాలో మిగిలిన ప్రాంతాలు కూడా పనిచేయాలని సూచించారు.

ప్రతి నెల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఇతర అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే సచివాలయాన్ని పదేపదే సందర్శించకుండా రొటేషన్ విధానంలో అన్ని సచివాలయాలను పరిశీలించాలని, తనిఖీల ఫోటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను సమర్థవంతంగా నిర్వహించి చిన్నారుల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్లను వేగవంతం చేయాలని, ఆధార్ లేని అర్హులందరికీ ఆధార్, రైస్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థుల ఆధార్ సమస్యలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. వెల్ఫేర్ సెక్రటరీలు ప్రతి సోమవారం, గురువారం పాఠశాలలను సందర్శించి టాయిలెట్ల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నాణ్యత, విద్యార్థుల హాజరు, యాప్‌లో నమోదులు తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ఎంఈఓలు, హెడ్‌మాస్టర్లు బోధన నాణ్యత, విద్యార్థుల అభ్యాస స్థాయిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బడి బయట పిల్లల వివరాలపై వాస్తవ సమాచారమే నమోదు చేయాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న పాఠశాల భవనాల తొలగింపులో ఆలస్యం చేయరాదన్నారు.

ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో తాగునీరు, పారిశుధ్యం, ఆహార నాణ్యత, వార్డెన్ల పనితీరును నిరంతరం పరిశీలించాలని సూచించారు. సచివాలయాల పనితీరుపై ప్రజల అభిప్రాయాలను సేకరించి, సిబ్బంది సమయపాలన, సేవల నాణ్యత, అవినీతి రహిత సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంటింటి చెత్త సేకరణ, పెన్షన్ పంపిణీ పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. వాట్సాప్ మిత్ర ద్వారా అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, ప్రతి సచివాలయం రోజుకు కనీసం ఐదు సేవలను వాట్సాప్ ద్వారానే అందించాలని సూచించారు. ప్రతి స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డు సచివాలయంలో క్యూ ఆర్ కోడ్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను సేకరించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కౌశలం కార్యక్రమంపై అధికారులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, పరీక్షల నిర్వహణలో డిజిటల్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా 258 గ్రామాల్లో ఓడిఎఫ్‌ం థర్డ్ పార్టీ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉందని, అధిక పెండింగ్ ఉన్న మండలాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జీరో పెండింగ్ సాధించిన మండలాల పనితీరును ఆదర్శంగా తీసుకుని మిగిలిన మండలాలు కూడా లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ( పి ఎం ఎ జి వై) కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సకాలంలో వినియోగించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు పంపించాలని, లేనిపక్షంలో తదుపరి నిధుల విడుదలపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఈ పథకానికి సంబంధించిన పెండింగ్ వ్యయాలను అత్యవసరంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లైబ్రరీ సెస్‌ను ప్రతి నెల నిర్దేశిత గడువులోగా స్వర్ణగ్రామ్ పోర్టల్ ద్వారా చెల్లించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు ఈ ఆదాయంపైనే ఆధారపడి ఉన్నందున ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు.

## విద్యుత్ మీటర్ల తొలగింపు నోటీసులను ఉపసంహరించుకోవాలి

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం పుట్టుపల్లె గ్రామానికి చెందిన దళిత కుటుంబాల



వ్యవసాయ విద్యుత్ మీటర్లను తొలగించేందుకు ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి సామెలు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి రాజు ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..పుట్టుపల్లెలో దళితులు 40 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను నమ్ముకుని, సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. కోర్టు ఆదేశాల పేరుతో భూముల్లో ఉన్న విద్యుత్ మీటర్లను తొలగించాలని అధికారులు నోటీసులు జారీ చేయడం అత్యంత విచారకరమన్నారు. నోటీసుల్లో పేర్కొన్న సర్వే నంబర్లలోని వివాదాలకు, దళితుల భూములకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. విద్యుత్ అధికారులు ఇచ్చిన నోటీసులకు ప్రభుత్వ రెవెన్యూ, అటవీ శాఖ అధికారులే వివరణ ఇచ్చుకోవాలి తప్ప, పేద దళితులకు ఎలాంటి సంబంధం లేదని, వారు సమాధానం చెప్పాల్సిన అవసరం కూడా లేదన్నారు.

తాము వాడుకుంటున్న వ్యవసాయ విద్యుత్ మీటర్ల బిల్లులను దళితులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా కచ్చితంగా చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. విద్యుత్ మీటర్ల తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి లక్ష్మణ్,సిపిఐ మండల సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ రైతులు, పాల్గొన్నారు.

## ఆదోనిలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న శక్తి టీం: నిలిచిపోయిన 8వ తరగతి బాలిక పెళ్లి

**కౌన్సెలింగ్‌తో మనసు మార్చుకున్న తల్లిదండ్రులు - చట్టపరమైన నిబంధనలు వివరించి బాలిక భవిష్యత్తును కాపాడిన అధికారులు**

(ఆదోని, జూలై 15: ప్రజా వాయిస్ న్యూస్ ఆదోని




) కర్నూలు జిల్లా, ఆదోని మండలంలోని ఇస్వి గ్రామంలో జరగబోతున్న ఒక బాల్య వివాహాన్ని 'శక్తి' టీం సభ్యులు సకాలంలో స్పందించి అడ్డుకున్నారు. 8వ తరగతి చదువుతున్న బాలికకు వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు చేస్తున్న ఏర్పాట్లను గుర్తించిన అధికారులు, సమన్వయంతో ఆ వివాహాన్ని రద్దు చేయించి బాలికా విద్యకు భరోసా కల్పించారు.

ఘటన నేపథ్యం: ఇస్వి గ్రామంలో మైనర్ బాలికకు నిశ్చితార్థం జరిగి, త్వరలో వివాహం జరిపించేందుకు కుటుంబీకులు సిద్ధమవుతున్నట్లు శక్తి టీంకు విశ్వసనీయ సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే శక్తి టీం సభ్యులు రాజేశ్వరి, వీరాంజినేయులు తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లారు. బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సమావేశమైన అధికారులు, బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, ఇది శిక్షార్హమని స్పష్టం చేశారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల బాలిక ఆరోగ్యంపై పడే ప్రభావాలు, చదువు ఆగిపోవడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ.. బాలికను ఉన్నత చదువులు చదివించి, ఆమె భవిష్యత్తును బంగారుమయం చేయాలని తల్లిదండ్రులకు హితబోధ చేశారు. అధికారుల వివరణతో వాస్తవాలను గ్రహించిన కుటుంబ సభ్యులు, వివాహాన్ని రద్దు చేసుకునేందుకు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు రాజేశ్వరి, వీరాంజినేయులు, ఇస్వి పోలీస్ స్టేషన్ సిబ్బంది షేక్ సబ్, పీసీ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పవతి, వీఆర్వో, సచివాలయం డిజిటల్ వెల్ఫేర్ & ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, సీహెచ్‌వో పద్మావతి, అంగన్‌వాడీ టీచర్ మమత తదితరులు పాల్గొన్నారు. బాల్య వివాహాలు లేని సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు కోరారు. ఎక్కడైనా మైనర్ బాలికల వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే, వెంటనే సంబంధిత పోలీసు, అంగన్‌వాడీ, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోషకాహార లోపంతోనే దృష్టిలోపాలు

మహానంది, పల్లె వెలుగు పోషకాహార లోపంతోనే దృష్టిలోపాలు వస్తున్నాయని జిల్లా అందత్వ నివారణ సంఘం కంటి వైద్య అధికారి డాక్టర్. జి .కృష్ణమోహన్ రెడ్డి పేర్కొన్నారు.



బుధవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 63 మందికి దృష్టిలోపాలున్నట్లు గుర్తించారన్నారు.త్వరలో ఉచితంగా కంటి అద్దాలు సరఫరా చేస్తామన్నారు. దృష్టిలోపాలు నివారించాలంటే పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల్లోపు ఒక లక్ష ఇంటర్నేషనల్ యూనిట్స్ విటమిన్ ఏ ద్రావణం ఇప్పించాలన్నారు. ఐదు సంవత్సరాలు వచ్చే అంతవరకు ప్రతి ఆరు నెలలకోసారి రెండు లక్షల విటమిన్ ఏ ద్రావణం ఇప్పించాలని తెలిపారు. జిల్లా నోడల్ ఆఫీసర్ జగదీష్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆకుపచ్చని ఆకుకూరలు, కూరగాయలు, మంచి పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి, సిహెచ్ఓ నాగమల్లేశ్వరి,ఏఎన్ఎం రమాదేవి , ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మండల స్థాయి సమావేశం బూతు లెవెల్ గ్రామ నాయకులతో సమావేశం..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక



గడివేముల మండలం బుజునూర్ గ్రామంలో టీడీపీ పార్టీ జాతియ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు గారి మరియు పాణ్యం నియోజకవర్గం గడివేముల మండలం బుజనూరు గ్రామంలో ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా పార్లమెంట్ అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డిలి వారి ఆదేశాల మేరకు ప్రతి నెల రెండవ బుధవారం మండల స్థాయి సమావేశంలో భాగంగా సాయంత్రం మండల కన్వీనర్ పంటా దిలిప్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించటం జరిగింది. సమావేశంలో గ్రామాల లో జరగవలసిన పలు పనులపై సర్ వెరిఫికేషన్ గురించి తీర్మానం చేయటం జరిగింది, గత నెలలో చేసిన తీర్మానాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలం లోని అన్ని గ్రామాల నాయకులు, క్లస్టర్,యూనిట్, బూత్ ఇంచార్జ్ లు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com